విశాలాంధ్ర

శ్రీకాకుళం

మంగళవారం 10, సెప్టెంబర్ 2024

పేజి నెం. 9

"ఖేలో ఇండియా జాతీయ స్థాయి పోటీలకు హాసిని"

విశాలాంధ్ర-టెక్కలి: ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రంలో టైక్వాండో శిక్షణ పొందుతున్న రౌణగల హాసిని ఇటీవల తిరుపతిలో జరిగిన ఖేలో ఇండియా రాష్ట్ర స్థాయి పోటిల్లో బంగారు పతకం సాధించి తమిళనాడు రాష్ట్రం లో గల దిండిగల్ లొ ఈనెల 11,12,13 మరియు 14 తేదీల్లో జరగబోయే ఖేలో ఇండియా జాతీయ స్థాయి టైక్వాండో పోటిల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరుపున మహిళా విభాగంలొ అండర్ 14 క్యాడట్ ఓవర్ 59 కిలోల కేటగిరీ లొ తలబడబోతున్నట్లు శిక్షకులు నర్సిపురం శేఖర్ సోమవారం తెలిపారు. హాసిని జాతీయ స్థాయిలో పోటీపడుతున్నందుకు డిఎస్డిఓ డాక్టర్ కళ్లేపల్లి శ్రీధర్, పలువురు అభినందనలు తెలిపారు.

ప్రపంచ విప్లవాల వేగుచుక్క కామ్రేడ్ మావో..

సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల

విశాలాంధ్ర-పలాస: కామ్రేడ్ మావో చిరస్మరణీయుడని ప్రపంచ విప్లవాల వేగుచుక్క అని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. సోమవారం పలాస మండలం తర్లకోట పంచాయతీ కొటారింగి గ్రామంలో కామ్రేడ్ మావో 48వ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా మాధవ రావు మాట్లాడుతూ మార్క్సిజం లెనిన్ నిజం మావో ఆలోచన విధానం ప్రపంచంలో ఉన్న అన్ని దేశాలకు దిక్సూచిగా మారాయని అన్నారు. వ్యవసాయక దేశాలలో విప్లవాన్ని ఎలా తీసుకురావాలన్నది బాబు ఆలోచన తెలియజేస్తుంది రైతాంగాన్ని విప్లవానికి ఎలా సంసిద్ధత చేయాలో మావో రచనల ద్వారా మనం చూడవచ్చని, మావో ఆచరించి చైనాలో సాయుధ పోరాటం నడిపి గేరిల్లా యుద్ధం చేసి విప్లవాన్ని విజయవంతం చేశారని గుర్తు చేశారు. ఇవాళ భారతదేశంలోని వెనకబడ్డ వ్యవసాయక దేశాల్లో అర్ధ వలస అర్ధ భూస్వామ్య స్వభావం కలిగిన ఈ దేశానికి వ్యవసాయక విప్లవమే పరిష్కార మార్గమని మాధవరావు తెలిపారు నూతన ప్రజాస్వామ్యక విప్లవం విజయవంతం చేయడం ద్వారానే కామ్రేడ్ మావో కి నివాళులర్పించిన వాళ్ళమవుతామని, మావో ఆశయాలను సాధిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్ టియు జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి సవర సోమేశ్వరరావు సవర బంగ్లా కుమార్ పాల్గొన్నారు.

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: మండలంలో తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపిపి ప్రతినిధి ఉప్పర పల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. సోమవారం మంచినీళ్లపేట, హుకుంపేట తీర ప్రాంతాల్లో ఆయన పర్యటించి కోతకు గురైన సముద్ర తీరం చూసి మత్స్యకారులకు ముందస్తు జాగ్రత్తలు వలలు, తెప్పలు దూర ప్రాంతంలో భద్రపరుచుకోవాలని సూచించారు. ఆయనతో పాటు వైస్ ఎంపిపి వంక రాజు, మత్స్యకారులు ఉన్నారు.

మహేంద్రతనయ ప్రవాహాన్ని పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర-సోంపేట: సోంపేట మండలం గుండా ప్రవహిస్తున్న మహేంద్రతనయ నది ప్రవహాన్ని తహశీల్దార్ అప్పలస్వామి బారువ ఎస్సైతో కలిసి సోమవారం పరిశీలించారు. మండలం గిరిజన గ్రామమైన బాతుపురం వద్ద నది ప్రవహాన్ని పరిశీలించి సమీప గ్రామాలకు చెందిన ప్రజలకు పలు సూచనలు చేశారు. మహేంద్రతనయ ప్రమాదకర స్థాయిలో ప్రవహించడం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నది వైపు వెళ్లవద్దని బాతుపురం, ఎంజీపురం గ్రామాల ప్రజలకు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

విజయవాడ ఈస్ట్ 16 వ డివిజన్ లో పర్యటించిన ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

నిత్యవసర సరుకులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఎంజీఆర్

విశాలాంధ్ర-పాతపట్నం: ముఖ్యమంత్రిచంద్రబాబు నాయడు ఆదేశాలు మేరకు విజయవాడ ఈస్ట్ 16 వ డివిజన్ భూపేష్ గుప్తా నగర్ లో వరద "నష్టం గణన" లో సోమవారం ఇంటింటికి పర్యటించిన పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణి, కలుషిత వాతావరణంలో వున్న ప్రజలకు నిత్యం వైద్య సదుపాయాలు కల్పించేటట్లు ఆదేశించడం, వరదల్లో సర్వం కోల్పోయిన కుటుంబాలను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పిన కూటమి మరియు ముఖ్యమంత్రి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు

విశాలాంధ్ర-జలుమూరు: మండలం కరకవలస గ్రామంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా షెడ్లు వేస్తున్నారని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామ రెవెన్యూ అధికారి గేదెల విజయబాబు అడ్డుకున్నారు. ప్రభుత్వ స్థలంలో ఎవరైనా ఆక్రమించినచో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని గ్రామస్తులకు రెవెన్యూ అధికారి తెలిపారు.

వరద బాధితులకు ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ దుప్పట్లు, సామాగ్రి పంపిణీ

విశాలాంధ్ర-జలుమూరు: విజయవాడ ముంపు ప్రాంతాలకు ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేతుల మీదగా సోమవారం వెయ్యి దుప్పట్లు వాటర్ బాటిల్స్ బిస్కెట్లు పంపిణీ చేయించారు. వాంబే కాలనీ, రామ మందిర కాలనీలలో ఈ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మెట్ట జనార్దన్ రావు, ఉత్తరాంధ్ర అధ్యక్షులు ఇల వండగణపతి రావు, శ్రీకాకుళం జిల్లా గౌరవ అధ్యక్షులు మామిడి సత్యనారాయణ పలువురు పాల్గొన్నారు. సీనియర్ నాయకులు సుందరం నాయకత్వంలో కార్యక్రమం జరిగింది.

ముంపు పొలాల రైతులకు ఏవో సూచన

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంట పొలాలు నీట మునిగాయి. ముంపు బారి న పడిన పొలాల రైతులకు మండల వ్యవసాయ అధికారి మెట్ట మోహనరావు సూచనలు సలహాలు అందించారు. సోమవారం మండలంలోని కొర్లకోట, చీమ లవలస, తొగారం, కలివరం మరియు దూసి గ్రామాల్లో పర్యటించి పొలాలలో ఉన్న నీటి పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని చర్యలు చేపట్టాలని తెలిపారు. వరదల వలన నీటి ముంపునకు గురి అయిన పొలను పరిశీలించి రైతులకు సూచనలివ్వడం జరిగింది. పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా తక్షణమే బయటకు పంపించే ఏర్పాట్లు చేయాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రమణ మూర్తి వి ఏ ఏ లు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వర్షాలతో పొంగి పొర్లుతున్న కాలువలు, చెరువులు

పంటల ముంపుతో రైతుల ఆందోళన

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు, కాలువలు పొంగి పొర్లుతున్నాయి. దీనికి తోడు మండలానికి ఎగువన నాగావళి, దిగువన వంశధార నదులు ప్రవహిస్తున్నాయి. అవి కూడా కురుస్తున్న వర్షాలకు పొంగి పొర్లుతున్నాయి. దీంతో కురిసిన వర్షం నీరు ఎక్కడికక్కడే స్తంభిస్తోంది. దీంతో మరింత ఇబ్బంది కారంగా మారింది. కాలువలు, చెరువులు ఎక్కడ గండ్లు కొడతాయోననే ఆందోళన రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పంటలు చాలా వరకు ముంపుకు గురయ్యాయి. దీనికి తోడు చెరువులు గానీ, కాలువలు గానీ గండ్లు కొడితే ఇంకా అంతే సంగతులే. వర్షాలు అధికంగా పడటం వలన నైర గ్రామ పంచాయతీకి సంబంధించిన చెరువులు నిండుకుండలా ఉండడం వలన ఎప్పుడు ఏ ప్రమాదం ముంచికొస్తుందో అనే చెరువు పొర్లు పై నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటం వలన దేశవాళీ వరద, వంశధార కుడి కాలువ ద్వారా వస్తున్న నీరు ఈ రెండూ కలిపి పంచాయతీ సంబంధించి సుమారు 270 ఎకరాలు వరి పంట భూమి ముంపునకు గురయ్యింది. ఇంతవరకు ఇరిగేషన్ డిపార్ట్మెంట్ వారు ఎవరు స్పందించకపోవడంతో నైర గ్రామం దగ్గర ఉన్న సర్ప్లస్ కలింగులను (చెక్కలు) రెండు మీటర్లు చెప్పున్నా ఐదు చెక్కలను పైకి లేపి వంశధార నదిలోకి నీరు విడిచి పెట్టడం జరిగింది. దీని వలన బైరి, గార మండలంలో గల బూరవెల్లి, అంబల్ల వలస, తదితరు గ్రామాలకు వరి పంట ముంపు నుండి కాపాడడం జరుగుతుందని నైర గ్రామ సర్పంచ్ ఆరవల రామ ప్రతాప్ తెలిపారు. ఇప్పటికైనా ఇరిగేషన్, వంశధార అధికారులు కాలువలు, చెరువులను పరిశిలించాలని రైతులు, ప్రజలు

అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే డాక్టర్ అశోక్

విశాలాంధ్ర-సోంపేట: బంగాళాఖాతంలో వాయుగుండం దృష్ట్యా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ పేర్కొన్నారు. తీవ్ర వర్షాలపై ఎమ్మెల్యే అప్రమత్తమై సోమవారం ఉదయం సోంపేట తహశీల్దార్ కార్యాలయానికి హాజరై తహశీల్దార్ అప్పలస్వామితో పలు విషయాలను సమీక్షించారు. సోంపేట మండలం బాతుపురం, శాసనాం, కర్తలిపాలెం, గొల్లవూరు, తదితర గ్రామాల మీదుగా ప్రవహిస్తున్న మహేంద్రతనయ నది నీటి ప్రవహాన్ని పరిశీలించాలని సూచించారు. గ్రామాల్లో భారీ వర్షాలకు ప్రమాద పరిస్థితులు ఉన్న ఇండ్లను సిబ్బంది ద్వారా ముందుగానే పరిశీలించి సంబంధిత కుటుంబీకులను అప్రమత్తం చేయాలని కోరారు. జేసీబీ యంత్రాన్ని సిద్ధంగా ఉంచుకుని ఎక్కడైనా చెరువులకు గండ్లు వాటిల్లినా నీరు నిల్వ ఏర్పడినా వాటిని చక్క దిద్దేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సోంపేట సీఐతో పాటు టీడీపీ నాయకులు బీన ఆనంద్, చిత్రాడ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

గొట్టా బ్యారేజ్ ని వరద పరిస్థితిని పరిశీలించిన బీజెపి నేత సిరిపురం

విశాలాంధ్ర-కొత్తూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం కారణంగా శ్రీకాకుళం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురవడంతో వంశధార నదికి వరదలు వచ్చే అవకాశం ఉన్నందున గొట్టా బ్యారేజ్ ని సందర్శించిన పాతపట్నం నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు సాంకేతిక నిపుణులు సిరిపురం తేజేశ్వరరావు, ఒడిస్సా క్యాచ్ మెంట్ ఏరియాలో అధిక శాతం వర్షాలు కురవడంతో వంశధార నదికి వరద నీరు పోటెత్తడంతో వంశధార నది పరివాహక గ్రామాలకు వరద నీరు వచ్చే ప్రమాదం ఉందని తెలుసుకుని లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పుడు ఏ అవసరం వచ్చినా సంబంధిత అధికారులను వెంటనే సంప్రదించాలని ప్రజలను కోరారు. నదీ పరివాహక గ్రామాలను ఎప్పటికప్పుడు సందర్శించి, ప్రజలను చైతన్య పరచాలని అధికారులను కూడా కోరారు. గొట్టా బ్యారేజీ నీటి ప్రవాహాన్ని గమనించి బ్యారేజ్ లో సిల్ట్, గుర్రపు డెక్క అధిక శాతంలో డిపాజిట్ కావడంతో స్టోరేజీ కెపాసిటీ లేకపోవడం వలన ఎప్పుడు వచ్చిన వరద నీరు అప్పుడే సముద్రంలోకి విడిచిపెడుతున్నారని సిల్ట్, గుర్రపు డెక్క మొత్తాన్ని తొలగిస్తే డెప్త్ పెరిగి స్టోరేజీ పెరుగుతుందని సూచించారు. గత వేసవిలో చూసినప్పుడు బ్యారేజీ లో పూర్తిగా నీరు లేకపోయినా సందర్భంలో కిలోమీటర్ దూరం వరకు సిల్ట్, గుర్రపు డెక్క డిపాజిట్ అయి ఉండటం వలన బ్యారేజ్ డెప్త్ లేకపోవడం గమనించినట్లు తెలిపారు. సిల్ట్, గుర్రపు డెక్క పూర్తిగా తొలగించడం వలన బ్యారేజ్ డెప్త్ పెరిగి ఆ నీటిని రానున్న వేసవి లో త్రాగు, సాగు నీటి అవసరాల కొరకు ఆ నీటిని వినియోగించుకోవచ్చని సూచించారు.

తుఫాన్ తీరం దాటే సమయంలో అప్రమత్తం

విశాలాంధ్ర-కవిటి: ఒరిస్సా రాష్ట్రం పూరీ సమీపంలో తీవ్ర వాయు గుండం సోమవారం మధ్యాహ్నం నాటికి తీరం దాటిందని తీవ్ర వాయు గుండం ప్రభావంతో ఉత్తరాంధ్రలో భారీ నుండి అతి భారీ వర్షాలు, కోస్తాలోనూ పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొందని దీని ప్రభావంతో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, రైతులు, కూలీలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బెందాలం అశోక్, ఆర్డీవో భరత్ నాయక్ సూచించారు. మంగళవారం మధ్యాహ్నం కవిటి తహసీల్దార్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో చర్చించారు. తుఫాన్ ప్రభావం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇద్దివానిపాలెం తదితర మత్స్యకార గ్రామాల్లో పర్యటించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ డాక్టర్ బెందాలాం అశోక్, ఆర్డీవో భరత్ నాయక్ మాట్లాడుతూ ఇద్దివానిపాలెం గ్రామం వద్ద పొగురు ప్రాంతం కావడం తో అక్కడి ప్రజలు అప్రమత్తం గా ఉండాలని అన్నారు. నీటి ఉధృతి అధికం అయినప్పుడు ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు తరలిం చాల్సి ఉంటుందని ప్రజలు సహకరించాలని కోరారు. ఇప్పటికే 49.2 మీ.మీ వర్షపాతం నమోదైందని తెలిపారు. తుఫాను ప్రభావితం చూపే ప్రాంతాల్లో అందరిని ఇప్పటికే అప్రమత్తం చేశామన్నారు. వాగులు, వంకలు పొంగే ప్రాంతాల వైపు వెళ్లొదని ప్రజలకు సూచించారు. తుఫాను ప్రభావం అధికంగా ఉండే గ్రామాల్లో ఇప్పటికే పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. భోజనం, నివాసం, వైద్య సేవలను అందుబాటులో ఉంచామన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి అప్పల స్వామి, తహసిల్దార్ మురళీమోహన్, ఎం పి డి ఓ శ్రీనివాస రెడ్డి, డి టి రామచంద్ర రావు, ఆర్ ఐ రమణ మూర్తి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం ఫార్మా కంపెనీపై చర్యలేవి?

- గాయపడ్డ కుటుంబానికి మాజీ సీఎం సాయం
- బాధితులకు అండగా ఐదు లక్షల చెక్ అందజేత
- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

విశాలాంధ్ర-ఆమదాలవలస: గత నెల ఆగస్టు 21వ తేదీన అచ్యుతాపురం సేజ్ లో గల ఎసెన్షియో ఫార్మా కంపెనీలో జరిగిన విషాదకర ఘటన 17 కుటుంబాల్లో అంతులేని ఆవేదనను మిగిల్చిందని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. అదే ప్రమాదంలో మృతి చెందిన ఆమదాలవలస మండలం వంజంగి గ్రామానికి చెందిన పైడి రాజశేఖర్ కుటుంబాన్ని మరో మారు సోమవారం తమ్మినేని పరామర్శించారు. తమ పార్టీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బాధిత కుటుంబాలకు ఆపన్న హస్తం అందించేందుకు ముం దుకు వచ్చారన్నారు. మృతిచెందిన వాళ్లకి ఐదు లక్షలు, ప్రమాదం బారిన పడిన వారికి లక్ష రూపాయలు చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారన్నారు. ఆ మేరకు ఐదు లక్షల రూపాయలు చెక్కు ను బాధిత కుటుంబానికి తమ్మినేని సీతారాం అందించారు. మానవత్వం మూర్తీభవించిన మాజీ సీఎం జగన్మోహ న్ రెడ్డి ని స్ఫూర్తిగా తీసుకొని, మిగిలిన రాజకీయ పార్టీలు కూడా బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం ప్రకటించాలన్నారు. గాయపడిన మనసులకు మానవ త్వంతో సాయం అందించాలన్నారు.ఇది రాజకీయ పార్టీల కనీస బాధ్యత అన్నా రు. 17 మంది ప్రాణాలను పొట్టన పెట్టు కున్న అనన్షియో కంపెనీ యాజమాన్యం పై ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం కనీస చర్యలకు ఉపక్రమించకపోవడం ఘోరం అన్నారు. కంపెనీ యాజమాన్యం పరిశ్రమలో కనీస భద్రత ప్రమాణాలు పాటించ కపోవటమే, ఇటువంటి పరిణామానికి దారి తీసింది అన్నారు. ఈ కార్యక్రమం లో సీనియర్ నాయకులు కోట గోవింద రావు మాజీ డిసిసిబి డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు వైస్ ఎంపీపీ మాను కొండ వెంకటరమణ స్థానిక ఎంపీటీసీ తాండ్ర ధనుంజయరావు బెండి జయరాం వసంత, తమ్మినేని వేణు ఎన్ని రామచం ద్రయ్య గురుగుబెల్లి అప్పలనాయుడు కుటికుప్పల సన్యాసిరావు మన్మధరావు చంద్రయ్య బొడ్డేపల్లి అనిల్ స్థానిక నాయ కులు హరనాథ్ కింతలి సురేష్ తది తరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై కఠిన చర్యలు

25.5 కిలోల గంజాయి, 7 మొబైల్ ఫోన్లు స్వాధీనం

ఎస్పీ కె.వి. మహేశ్వర్ రెడ్డి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం: మత్తు పదార్థాలకు యువత బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్న జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర్ రెడ్డి అన్నారు. సరిహద్దు ప్రాంతంలో సాగుతున్న గంజాయి అక్రమ రవాణాపై దృష్టి సారించి నిందితులను అదుపులోకి తీసుకున్న ఇన్‌స్పెక్టర్ ఎం. చిన్నంనాయుదు, సబ్ ఇన్‌స్పెక్టర్ ఈ. చిన్నంనాయుడలను ఆయన అభినందించారు. పురుషోత్తపురం కేంద్రంగా తరలించడానికి సిద్ధంగా ఉంచిన 25.560కిలోల గంజాయి రవాణను అడ్డుకున్న పోలీసులు గంజాయి రవాణా ముఠా సభ్యులు ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుండి 7 మొబైల్ ఫోన్లు ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అక్రమ రవాణాపై స్థానిక పోలీస్ కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ నిందితులను ప్రవేశపెట్టి మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దుతామని అన్నారు. నిషేధిత మత్తు పదార్థాల వినియోగం రవాణకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పురుషోత్తపురానికి చెందిన బుగ్గ చిరంజీవి, అతని తల్లి సావిత్రి, తెలుకల క్రిష్ణ సాహులు పురుషోత్తపురం సరిహద్దులో పాన్ షాప్‌లు నిర్వహిస్తున్నారు. అక్కడ నిషేధిత గంజాయిని ఒఢిశా నుంచి అక్రమంగా తెప్పించి, విక్రయాలు సాగిస్తున్నారని, వారికి ఒఢిశా గంజా జిల్లా తినిపొరియా గ్రామానికి చెందిన రబీంద్ర సేథి, సింహాచల సేథిలు గంజాయి సరఫరా చేస్తుంటారు. తమిళనాడుకు చెందిన రమేష్ వేలాయుతం డ్రైవర్‌గా ఉంటూ పురుషోత్తపురం పాన్ షాప్‌ల వారితో పరిచయం ఏర్పర్చుకుని ఇక్కడిని తమిళనాడుకు గంజాయి తరలించి విక్రయాలు సాగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారని ఎస్పీ వివరించారు. గంజాయి అక్రమ రవాణా విక్రయాలపై నిఘా పెట్టి, సోమవారం ఒఢిశా నుండి గంజాయి తీసుకొచ్చిన సమాచారంతో పాన్‌షాప్‌లు తనిఖీ చేయగా విషయం గుట్టురట్టయిందని ఎస్పీ తెలిపారు. స్థానిక పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి 6గురు నిందితులను రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఎస్పీ తెలిపారు. కాగా వీరిలో బుగ్గ చిరంజీవి, సావిత్రిలపై గతంలో కూడా గంజాయి కేసుల నమోదై ఉన్నాయని, నిషేధిత పదార్థాలను పూర్తిగా నిర్మూలించే చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను కనిపెడుతు ఉండాలని, చెడు వ్యసనాలక దూరంగా ఉండేలా చూడాలని కోరారు. మీడియా సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసరావు, డిసిఆర్‌బి సి.ఐ ఇమ్మాన్యుయేల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా వరహాలగెడ్డ

కిష్టుపురం అండర్ పాసైజ్ వద్ద నిలిచిన వరదనీరు

విశాలాంధ్ర-పలాస: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లొత్తూరు కొండలపై కురిసిన వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో గెడ్డలు, వాగులు, చెరువులు, కాలువలు పొంగి పొర్లుతున్నాయి. మండలంలో బ్రాహ్మణ తర్లా, కంబిరిగాం ప్రాంతాల్లో వరహాలగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. కిష్టుపురం సమీపంలో ఉన్న సవరగెడ్డకు వరదనీరు వచ్చి చేరడంతో అండర్ పాసైజ్‌లో సుమారు మూడు అడుగుల ఎత్తులో నీరు నిల్వ ఉంది. దీంతో గత మూడు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. సుమారు 15 గ్రామాల ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ఇదిలా ఉండగా బ్రాహ్మణతర్లా, తర్లాకోట, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో జిల్లా భూగర్భ జలాల వనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ బి.రమణమూర్తి వరద ప్రాంతాల్లో పర్యటించారు. బ్రాహ్మణతర్లాలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఆయనతో తహశీల్దార్ సత్యం, ఎంపిడివో ఎన్.రమేష్‌నాయుడు, పంచాయతీ అధికారి మెట్ట వైకుంఠరావు, బ్రహ్మణతర్లా పంచాయతీ కార్యదర్శి లక్ష్మణరేఖలు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండండి : - జెసి అహ్మాద్ ఖాన్

విశాలాంధ్ర-మెలియాపుట్టి: ఇటీవల కాలంలో కురుస్తున్న వర్షాలకు వాగులు, నదులలో నీటి ప్రవాహం పెరుగుతుండడంతో లోతట్టు ప్రాంతాలలో నున్న ప్రజలకు ఎక్కడ ఇటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు, ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫార్మాద్ అహ్మాద్ ఖాన్ అన్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మహేంద్రతనయ నదిలో నీటి ప్రవాహం పెరగడంతో లోతట్టు ప్రాంతాలలోనున్న మెలియాపుట్టి మండలంలో గల రట్టిని గ్రామాన్ని సోమవారం సాయంత్రం సందర్శించి క్షేత్రస్థాయిలో నదీ పరివాహక ప్రాంతాన్ని, నీటి మట్టాన్ని పరిశీలించి ఇరిగేషన్ శాఖధికారులతో పాటు స్థానికులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు. మహేంద్ర తనయ వరద నీటి ఉధృతి పెరిగినట్లయితే గ్రామంలోకి నీరు ప్రవేశిస్తుందని వారు తెలియజేస్తూనే తమ గ్రామానికి నదికి ఆనుకొని రిటర్నింగ్ వాల్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు జెసి దృష్టికి తీసుకొని వచ్చారు. అంతకుముందు మెలియాపుట్టి మండల కేంద్రంలో గల మహేంద్ర తనియ నది వంతెన పై నుండి నీటి ప్రవాహాన్ని పరిశీలించే క్రమంలో గతంలో తితిలి తుఫాన్ సమయంలో వరద ఉధృతి ఏ రకంగా ఉన్నది తదితర వివరాలను టిడిపి నాయకులు బొచ్చు ప్రసాద్ జెసి దృష్టికి తీసుకుని వెళ్లారు. దీనికి సంబంధించి జెసి వంశధార ఈఈ శేఖర్ తో మాట్లాడారు. ఈ సందర్భన లో జెసి తోపాటుగా టెక్కలి ఆర్డిఓ సుదర్శనదొర, వంశధార ఈఈ శేఖర్, ప్రత్యేకధికారి, వెటర్నరీ ఏడి రవివర్మ, తహసిల్దార్ హనుమంతరావు, ఎంపీడీవో చంద్రకుమారి, వ్యవసాయధికారి దానకర్ణుడు, ఆర్ఐ వైకుంఠరావు, మండల పరిషత్ ఏఓ తిరుపతి పట్నాయక్, వీఆర్వో వెంకటరమణ ఇతర శాఖ అధికారులు, గ్రామస్తులు తదితరులున్నారు.

మునిగిన అప్రోచ్ రోడ్డు... రాకపోకలకు ఇబ్బందులు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: మండలంలోని బొంతలకోడూరు పంచాయతీ రుప్పపేట సమీపంలోని పెద్ద గెడ్డ వద్ద బ్రిడ్జి నిర్మాణం జరుగుతుండడంతో ప్రజలకు రాకపోకల కోసం తాత్కాలికంగా వేసిన అప్రోచ్ రోడ్డు భారీ వర్షాలకు మునిగింది. దీంతో ఆయా గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. పెద్దగెడ్డపై బ్రిడ్జి నిర్మాణం జరుగుతుండగా.. ప్రజల ఇబ్బంది లేకుండా అప్రోచ్ రోడ్డు నిర్మిం చారు. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండగా గెడ్డ వద్ద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అప్రోచ్ రోడ్డు పూర్తిగా కొట్టుక పోయింది. లావేటిపేట, పెదరుప్పపేట, చినరుప్పపేట, పాతదిబ్బలపాలెం గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిపై నడిచేందుకు వీలుగా ఏర్పాట్లుచేశారు. డుమా పీడీ జి.చిట్టిరాజు, తహసీల్దార్ సింహాచలం, ఎంపీడీవో రమాదేవి. ఏఎస్ శ్రీనివాసరావు తదితరులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

మునియామ్ చెరువుకు గండి

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: మండలం రామజోగిపేట వద్ద మునియామ్ చెరువుకు గండి పడింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులలో నీరు నిండిపోవడం తో చివరన గట్టుకు కోతకు గురైంది. నీరు పంటపొలాల మీదుగా వృథాగా ప్రవహిస్తోంది. నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంట నష్టాన్ని అంచనా వేయాలి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో రైతులకు జరిగిన పంట నష్టాన్ని పరిశీలించి, అంచనాలు తయారు చేసి త్వరగా జిల్లా కేంద్రానికి పంపాలని జిల్లా రెవిన్యూ అధికారి అప్పారావు స్థానిక అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానికంగా పర్యటించి బాహుదా నదిలో వరద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. తహశిల్దార్ వెంకట్రావు, డిఎస్పీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ ఎం. చిన్నంనాయుడు, సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌లతో కలిసి డొంకూరు గ్రామాన్ని సందర్శించి అక్కడి తుఫాన్ షెల్టర్ వద్ద గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తహశిల్దార్ కార్యాలయంలో స్థానిక అధికారులతో సమీక్ష నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలన సమర్థంగా నిర్వహించాలని సూచించారు.

కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఔదార్యం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: నగరంలోని ఎల్ఐసి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు విజయవాడ వరద ముంపు వల్ల సర్వం కోల్పోయిన వారి కోసం తమ వంతుగా నిత్యావసర సరుకులు, బిస్కట్ పేకెట్స్, వాటర్ బాటిల్స్ లను అందజేశారు. కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె శివశంకర్ మాట్లాడుతూ ఇలాంటి విపత్తు సమయంలో మనమందరం నిరాశ్రయులయిన వారిని ఆదుకోవాలన్నారు. అదేవిధంగా ప్రతిఒక్కరు తమకు వీలైన సహాయ సహకార్యాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె వేణు పాల్గొన్నారు.

విజయవాడలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు

విశాలాంధ్ర - హిరమండలం : విజయవాడలో హిర మండలం మేజర్ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు గడిచిన రెండు రోజులుగా స్పెషల్ క్యాంప్‌లో భాగంగా పారిశుద్ధ్యంను పారద్రోలు తున్నారని ఈఓ వైఎస్ఆర్.మూర్తి విలేకరులకు సోమవారం తెలియ జేశారు. అమరావతి అయిన విజయవాడలో ఇటీవల కురసిన వర్షాలకుగాను కృష్ణా నది పొంగి పోర్లడంతో రాజధాని నగరం అన్ని వీదులు వాడలు ముంపునకు గురి కావడంతో పంచాయతీ నుంచి పారిశుద్ధ్య మునుంచి శుభ్రపరచుటకుగాను నలుగురు సిబ్బందిని ఉన్నత అధికారులు ఆదేశాలు మేరకు పంపించినట్లు ఈఓ వై ఎస్ ఆర్ మూర్తి తెలియజేశారు. పారిశుద్ధ్య కార్మికులు 1 పదాలమజ్జి, 2 పడాల కనకారావు 3కె దినకర్ వీరితో పాటు శానిటేషన్ సూపర్ వైజర్ బి చిరంజీవి లు వెళ్లి వీరికి కేటాయించిన వీదుల్లో పరిశు భ్రం చేస్తున్నట్లు వివరించారు.

శిష్టకరణాలు ఓబీసీ సాధించే వరకు ఉద్యమం

రాష్ట్ర అధ్యక్షులు పోలిమహంతి

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : శిష్టకరణాలు ఓబీసీ సాధించేవరకు ఉద్యమం కొనసాగిస్తామని రాష్ట్ర శిష్టకరణ సంఘం (63/79) అధ్యక్షులు పోలిమహంతి ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం శ్రీకాకుళం లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఇప్పటికే పలుమార్లు ఓబీసీ ప్రయత్నంలో భాగంగా వెళ్ళామని అన్నారు. ప్రధాన కార్యదర్శి సూచన మేరకు, రాష్ట్రస్థాయి ఓబీసీ కమిటీ నియమించి ఆ కమిటీ ఆధ్వర్యంలో ఓబీసీ సాధన కోసం ఢిల్లీ వెళ్ళటం వంటివి చేద్దామని అన్నారు. కార్యవర్గ సూచన మేరకు రాష్ట్ర వ్యాప్తంగా మండల సంఘాలు, జిల్లా సంఘాలు ఎన్నికలు నిర్వహించి నిర్దిష్టమైన ఓటరు జాబితా తయారైన తరువాత రాష్ట్ర ఎన్నికలు నిర్వహిస్తామని ఉమామహేశ్వర రావు అన్నారు. ఈ కార్యక్రమం లో ప్రధాన కార్యదర్శి బి. జయబాబు, అడ్మిన్ కార్యదర్శి సదాశివుని క్రిష్ణ, ఉపాధ్యక్షులు బి.సుధాకర్, ప్రభాకర్ దాస్, సత్యప్రసాద్, పీవీ టి రామనరావు, పాత్రో, పావని, శర్మ శివప్రసాద్, ఎస్.లక్ష్మనరావు హరిబాబు తదితరులు పాల్గొన్నారు. జిల్లాల వారి నిర్వహిస్తున్న కార్యవర్గ సమావేశాల్లో భాగంగా ఈ సమావేశం జరిగింది.

ఉత్సాహంగా ప్రారంభమైన వారోత్సవాలు

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : జె.సి.ఐ వారోత్సవాలను సోమవారం క్లబ్ సభ్యులు ఉత్సాహంగా ప్రారంభించారు. పాత బస్టాండ్ వద్ద జె.సిఐ జెండాను అధ్యక్షుడు టి. షణ్ముఖ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ నెల 15 వరకూ వారోత్సవాలు నిర్వహించి కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించడం జరుగుతుందని క్లబ్ అధ్యక్షులు అన్నారు. ఈ సందర్భంగా చార్టర్ ప్రెసిడెంట్ అనుదీప్, సభ్యులు గోరు డిల్లేసు, స్వరూప్‌కుమార్‌లను ఘనంగా సన్మానించారు. అనంతరం క్లబ్ సభ్యులు కంచిలిలో సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాధ శరణాలయంలో ఆహారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మధుకుమార్, ప్రేమ్‌సాయి, వెచ్చా సంతోష్, వెచ్చా రాము, మోహన్ వెంకటేష్, రాజ్‌కుమార్, జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

స్మశాన వాటిక స్వాహా ఆరడుగుల దహన స్థలానికి ఆరాటం

- స్వర్గ ధామం దర్జాగాకబ్జా... స్మశాన వాటికను పంట పొలాలుగా మార్పు

- కల్లప్పగించి చూస్తున్న మండల అధికారులు

విశాలాంధ్ర - పొందూరు : జనులు జన్మించే జన్మభూమిపై కర్మ గాలక పరలోక ప్రాప్తి అయిన మృతులను స్వర్గ ధామంలో దహనం చేయలేని దౌర్భాగ్య పరిస్థితి మండలం కొల్లిపేట గ్రామంలో ఏర్పడింది. వివరాల్లోకి వెళితే ఆ గ్రామానికి ఊరి చివర తరతరాలుగా శవ దహనానికి రెవిన్యూ రికార్డు ప్రకారం సుమారు ఒక ఎకరా పైన భూమి ఉన్నప్పటికీ ఆ స్మశాన స్థలాన్ని కొంతమంది ప్రబుద్ధులు ఆక్రమణలు చేసుకొని పంట పొలాలగా మార్చారు. దహనానికి కావలసిన ఆరడుగులు స్థలం కూడా కల్పించడంలో మొఖం చాటేస్తున్నారు. పోనీలే అని శవ దహనానికి పక్కనున్న రెల్లిగడ్డలో దహనం చేద్దామంటే గత వారం రోజులుగా ఏడ తేర్పు లేని వర్షాలు వల్ల దహనం చేయడానికి వీలు కాదు. స్మశాన వాటికలో స్థలం లేదు.స్మశాన వాటికకు ఆ గ్రామ యువకులంతా శ్రమదానంతో రోడ్డు వేసుకున్నారు. ఆ నడిచే రోడ్డులోనే ఓ చిన్న దెప్పు పైన టెంటు వేసారు.ఆదివారం ఆ గ్రామా%శీ%లో మృతి చెందిన గేదల తవిటి నాయుడు (50) అకాల మృతి చెందాడు. ఆ శేవ దహనానికి గ్రామస్తులంతా పడరానీ పాట్లు పడ్డారు.ఎట్టకేలకు గట్టు పైన టెంట్ వేసి దహన కార్యక్రమాలు చేశారు. స్మశాన వాటికను దర్జాగా కబ్జా చేసి కొంతమంది ప్రబుద్దులు వరి నాట్లు వేసి పంట పండించుకుంటే మండల యంత్రాంగం కల్లప్పగించి చూస్తుందని పట్టించుకునే దాఖలాలే లేవంటూ ఆ గ్రామస్తులు మండిపడుతున్నారు. ఎన్నాళ్ళీ పాట్లు పడతామంటూ ఆ గ్రామ యువత గలమెత్తి అధికార యంత్రాంగ నిర్లక్ష్య నిరంకుశ వైఖరి పై ప్రశ్నించేందుకు సిద్ధమవుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి మా స్వర్గ ధామాన్ని మాకు అప్పగించాలని కోరుతున్నారు.

శివానీ అధ్యాపకులకు సీఎస్సీ అవార్డు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : భారత ప్రభుత్వం నీతి ఆయోగ్చే రిజిస్టర్ చేయబడిన నైపుణ్యాలు, సామర్ధ్యాలు పరిపాలనా సంస్థ (కౌన్సిల్ ఫర్ స్కిల్స్ (అండ్ కాంపిటెన్సీస్) ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)కు చెందిన ఇద్దరు అధ్యాపకులకు అవార్డులు అందుకున్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీటీ చంద్రశేఖర్ ఎక్సెలెన్స్ ఇన్ రీసెర్చ్ కం ట్రిబ్యూషన్ అవార్డు. ఎంబీఏ అధ్యాపకుడు డాక్టర్ బి.ప్రసాదరావుకు ఎక్సెలెన్స్ ఇన్ స్టూడెంట్ ఎంగేజ్మెంట్ అవార్డులు అందుక ఉన్నారు. అవార్డులు అందుకున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు. యాజమాన్య ప్రతినిధులు అభినందించారు.

అధిక ధర పలికిన వినాయక లడ్డు

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని రామయ్య పుట్టుగ వరసిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు వినాయక ప్రసాదంగా ఉంచిన లడ్డూ ను వేలం పాట చేపట్టారు. ఈ సందర్భంగా అదే గ్రామానికి చెందిన వజ్జ హరీష్ 11 వేల 111 రూపాయలు కు లడ్డు ప్రసాదాన్ని కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బెందాళం వెంకట్రావు, సతీష్, వినోద్, ఆనంద్, జయదేవ్, యోగి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వరద భాదితుల సహాయార్థం

ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.10 లక్షలు

విశాలాంధ్ర - కొత్తూరు : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అతలాకుతలమైన విజయవాడ మహా నగర ప్రజలకు బాసటగా ముఖ్యమంత్రి సహాయ నిధికి తన వంతుగా పది లక్షలు రూపాయిల చెక్‌ను విజయవాడలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుకు పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవింద రావు అందజేశారు.

వీడని వర్షం.. నీట మునిగిన పొలాలు

విశాలాంధ్ర - దుంబ్రిగూడ : బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మూడు, నాలుగు రోజులుగా వీడని వర్షంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. వాగులు, గెడ్డల ఉప్పొంగి ప్రవహిస్తున్న. గ్రామా, గ్రామానికి రాక పోకలు నిలిచిపోయాయి. గుంట గన్నెల, అరమ, లైగండ పంచాయతీల్లోని పిత్తగుడ, డోమంగి తుంబ్రుంగుడలో వరి పంట పొలాలు నీట మునగగా, ఇసుక మేటలు పంటలపై చేయడంతో గిరిజన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సంపంగిగెడ్డ, కితలంగి, చంపపాట్టి, చాపరాయి, గోరాపూర్ గెడ్డల ఉధృతితో గ్రామాలకే గిరిజనులు పరిమితమయ్యారు. మూడు నాలుగు రోజులుగా బయటి ప్రపంచానికి దూరంగా ఉండాల్సిన దుస్థితి పరిస్థితి గిరిజనులకు ఏర్పడింది. మండలంలో అల్పపీడన ప్రభావంతో గిరిజనులు ఇళ్లకే పరిమితం కావాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రసవం... గిరి గర్భిణీలకు ప్రాణ సంకటం

అల్పపీడన ప్రభావంతో పొంగి ప్రవేశిస్తున్న వాగుల గుండా గర్భిణీలను దాటిస్తున్న గిరిజనులు

విశాలాంధ్ర - చింతపల్లి : మారుమూల ప్రాంత గిరి గర్భిణీలు బిడ్డకు జన్మనివ్వాలంటే ప్రాణాలు పణంగా పెట్టాల్సిందే. రహదారులు లేని గ్రామాలు, అంబులెన్స్ లు వెళ్లలేని ఊర్లు ఇంకా ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. అల్పపీడన ప్రభావంతో మన్య ప్రాంతంలో గడచిన రెండు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్న క్రమంలో పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు, కోతకు గురై కొట్టుకుపోయిన రహదారులు, కూలిపోయిన కల్వర్టుల కారణంగా మారుమూల గిరి గ్రామాలలోని గర్భిణీలు ప్రసవ వేదనతో ఆసుపత్రులకు వెళ్లేందుకు ప్రాణాలు పణంగా పెట్టడమే గాక, ఆ గర్భిణీ ని ఆసుపత్రికి తరలించే క్రమంలో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సాహసం చేయవలసిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం అల్పపీడన ద్రోణి ప్రభావం కారణంగా మన్యంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున జీకే వీధి మండలం జర్రెల ప్రాంతానికి చెందిన గర్భిణీని జెర్రెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించేందుకు జెర్రెల వంతెన పై ప్రమాద భరితంగా ప్రవహిస్తున్న వరద నీటిని దాటేందుకు కుటుంబ సభ్యులు, అటువైపు ఉన్న అంబులెన్స్ కు, ఇటువైపు ఉన్న జీపుకు తాడు ఏర్పాటు చేసి గ్రామస్తులు రక్షణగా ఉండి గర్భిణీని సురక్షితంగా ఆసుపత్రికి తరలించారు. మన్య ప్రాంతంలో రహదారులు సక్రమంగా లేని కల్వర్టులు కొట్టుకుపోయిన ప్రాంతాలలో గర్భిణీలు, రోగులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించేందుకు గిరిజనులు ఇటువంటి సాహసాలు చేయక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. పాలకులు, అధికారులు స్పందించి మారుమూల ప్రాంతాల గిరి గర్భిణీలకు, రోగులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని మన్య ప్రాంతవాసులు కోరుతున్నారు.

పంటల పరిస్థితిని పర్యవేక్షించి సమచారమివ్వాలి

విశాలాంధ్ర - బాడంగి : అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకి మండలం లో వ్యవసాయసిబ్బంది అంత క్షేత్ర పరిశీలన చేసి పంటల పరిస్థితి ఎప్పటి కప్పుడు అందించాలని మండల వ్యవసాయధికారి కే. శిరీష తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన బాడంగి లో ఆమె పలు పంటలను పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు ఎడతెరుపు లేకుండా పడటం వల్ల పంట పొలాల్లో నీరు అధిక చేరు తుంది కావున వర్షపు నీరు బయటకి వెళ్లే మార్గాలు చేయాలన్నారు. వర్షం తరువాత వరి, ప్రత్తి పంటలకు 30కిలోలు యూరియా 15కిలోలు పోటాష్, మొక్కజొన్న ఎకరానికి 50 కిలోలు యూరియా మరియు 20 కేజీలు పొటాషియం ఎరువులు పైపాటుగా వేసుకోవాలనీ తెలిపారు. వరి లో పాము పొడ తెగుళ్లు పెరిగే అవకాశం ఉన్నందున పొలం నీరు తొలగించి హెక్స కొనజోల్ 2ఏంఏల్/లీటర్ నీటికి కలిపి మొదలు కి తడిచేలా పిచికారీ చేయా లన్నారు.మొక్కజొన్న ఆకు ఎండు తెగులు ఎక్కువగా రావడానికి అవకాశం ఉంది కావున నివారణకు ప్రోపి కోణజల్ ఒక లీటర్ నీటికి కలిపి మొక్కబాగా తడిసినట్లు పిచికారి చేయాలని తెలిపారు. బాడంగి లో మండల వ్యవ సాయధికారిణి శిరీషతో పాటు వీఏఏ మరడాన సత్యం, శంకరావు, కోరుపల్లిఅప్పలస్వామి జయలక్ష్మి,పొలాల్లో క్షేత్ర పరిశీలన చేసి వర్షానికి నీట మునిగిన మొక్కజొన్న పంట పరిశీలించారు.

పోడు పట్టాలివ్వాలంటూ గిరిజనుల వినతి

విశాలాంధ్ర - శృంగవరపుకోట : మండలంలోని కొండమల్లిపూడి గ్రామానికి చెందిన గిరిజనులు తమకు పోడు పట్టాలు ఇచ్చి మౌలిక వసతులు కల్పించాలంటూ సోమవారం పట్టణంలోని డిప్యూటీ తాసిల్దార్ భరత్ కుమార్ కి వినతిని అందజేశారు ఈ సర్ధార్బంగా గిరిజన నాయకుడు మహేష్ మాట్లాడుతూ. తాత తండ్రుల నుంచి పోడు వ్యవసాయం చేసుకుంటూ 16 కుటుంబాలు జీవనం సాగిస్తున్నామని సాగు చేస్తున్న భూమికి నేటికీ పట్టాలు ఇవ్వలేదని గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని కావున 16 గిరిజన కుటుంబాలకు సాగు చేసుకుంటున్న భూమికి బోడుపట్టాలి ఇచ్చి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని తాసిల్దార్ కి వినతిపత్రం అందజేశామని సమస్యను పరిష్కరించుకుంటే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండ మల్లిపూడి గిరిజన గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

అధిక వర్షాలతో పాడైన పలు రోడ్లు..అవస్థలు పడుతున్న వాహనదారులు

విశాలాంధ్ర - బాడంగి : మండలంలో ఇటీవల కురుస్తున్న అధిక వర్షాల ప్రభావంతో పలు గ్రామాల రోడ్లు పాడైపోవడంతో వాహనదారులు పలు అవస్థలకు గురవుతున్నారు. ముగడ నుంచి భీమవరం వెళ్లే రోడ్డు పలు దగ్గర గుంతలమై వాహనాలు వెళ్లడానికి ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. భీమవరం యూపీ స్కూల్ సమీపమున కాలువ దగ్గర రోడ్డు పెద్ద గోతులతో నిండి ఉంది. వాహనాలు రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. అలాగే ఆకుల కట్ట కోటిపల్లి రోడ్డు పరిస్థితి కూడా ఇందుకు అతీతం కాదు. చిన్న చిన్న వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఈ రోడ్డు నెలకొని ఉందని వాహనదారులు వాపోతున్నారు. కామన్న వలస నుంచి గొల్లది వెళ్లే రోడ్డు కూడా ఇటీవల కురిసిన వర్షాలకు పాడయింది. అలాగే డొంకిని వలస రైల్వే స్టేషన్ నుంచి వీరసగరం వెళ్లే రోడ్డు కూడా గుంతలు తో నిండి ఉంది. దీంతో ఆయా రోడ్డులో వాహనం నడపాలంటే చాలా ఇబ్బందులకు గురవుతున్నామని వాహనదారులంతా ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఆయా రోడ్డును తక్షణమే మరమ్మతులు చేపట్టి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయా గ్రామ ప్రజలు కోరుతున్నారు.

డెంకాడలో పలు వీధులలో పారిశుద్ధ్య పనులు

విశాలాంధ్ర - డెంకాడ : గత కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో డెంకాడలోని పలు వీధులు కాలనీలలో అపరిశుభ్రతంగా ఉండటం గుర్తించిన కూటమి నాయకులు సోమవారం డెంకాడ సెక్రెటరీ ఆధ్వర్యంలో వీధులలో కాలనీలో ప్రజలు శానిటేషన్ వర్కర్స్ సహాయంతో మురికి కాలువలు నీటి నిలిచిన ప్రాంతాలను శుభ్రం చేయించారు అలాగే ఎస్సీ కాలనీలోని మరియు గొల్ల వీధిలో కొన్ని కుటుంబాలు నివసిస్తున్న ప్రాంతాల్లో ఇల్లు సరిగా లేకపోవడంతో వారిని గుర్తించి నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే లోకం మాధవి దృష్టికి తీసుకెళ్తామని వారి కుటుంబానికి భరోసా కల్పించారు ఈ కార్యక్రమంలో జనసేన క్రియాశీలక వాలంటీర్ రొంగలి వెంకట్రావు బోనాలు రమణ సత్తిబాబు పాల్గొన్నారు.

ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలు చేయాలి

విశాలాంధ్ర - టెక్కలి : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతులకు పెట్టుబడి సాయం 20,000 ఇస్తామని ఎన్నికలలో ఇచ్చిన హామీ అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని, జీడి పంటకు మద్దతు ధర ప్రకటించి జీవో విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ నాయకులు బగాది వాసుదేవరావు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘము, కౌలు రైతు సంఘాలు జిల్లా కమిటీలు ఇచ్చిన పిలుపుమేరకు మండలంలో రావివలస, అయోధ్యపురం సచివాలయాల్లో సోమవారం కార్యదర్శులకు రైతులతో కలిసి మెమోరండం సమర్పించారు. అన్నదాత పెట్టుబడి సాయం 20,000 వెంటనే ఇవ్వాలని, 2023 ఖరీఫ్, రవి సీజన్లో కరువు తుఫానులతో నష్టపోయిన పంటలకు బీమా పరిహారం ఇవ్వాలని, సమగ్ర ఉచిత పంటల బీమా అమలు చేయాలని, జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు నిధులు కేటాయించి పూర్తి చేయాలని, జీడి పంటకు మద్దతు ధర ప్రకటించి జీవో విడుదల చేయాలని, తిత్లీ తుఫాన్ లో నష్టపోయిన జీడి కొబ్బరి రైతులకు ఇప్పటికీ నష్టపరిహారం అందని సుమారు 7000 మందికి వెంటనే పరిహారం చెల్లించాలని, రెండు లక్షల వరకు రైతులు రుణాలు రద్దు చేయాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు వద్దు జీవో 22 రద్దు చేయాలని, భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అన్ని రకాల రైతు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, జిల్లాలో కొబ్బరిపార్క్ ఏర్పాటు చేయాలి ఎరువులు పురుగుమందులు వాస్తవ ధరలకు అందుబాటులో ఉంచాలని తదితర డిమాండ్లతో గ్రామంలోని రైతులు, కౌలు రైతులతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు, రైతు సంఘం నాయకులు, ప్రతినిధులు పొలిన సాంబమూర్తి, ఇప్పిలి మల్లేశ్వరరావు, సర్లాన సుధాఖర్, పి కృష్ణారావు, ఎస్ గజపతిరావు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన జేసీఐ వారోత్సవాలు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : జేసీఐ వారోత్సవాలు సందర్భంగా జెసిఐ శ్రీకాకుళం మెయిన్, జెసిఐ శ్రీకాకుళం గ్రీన్ సిటీలు సంయుక్తంగా కార్యక్రమాలను సోమవారం స్థానిక చైతన్య సహకార జూనియర్ కళాశాలలో ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన. వేణుగోపాల్ కార్యక్రమాన్ని జెసిఐ వ్యవస్థాపకులు జెసి జామి భీమశంకర్, ప్రత్యేక అతిథి డా. పైడి.సింధూరలతో కలసి జెసి జెండాను ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ జెసిఐకు ఎనలేని సేవలందించిన అధ్యక్షులకు పేరు పేరునా అభినందనలని, సమాజంలో ఎదుగుదల, మంచి నాయకునిగా గుర్తింపు రావాలంటే జెసిఐలో సభ్యులుగా ఉండాలని, నేటి యువతకు జెసిఐ కార్యక్రమాలలో భాగసామ్యం చేయాలన్నారు. జెసి జామి బీమా శంకర్ మాట్లాడుతూ కొంక్యాన కుటుంబంతో స్నేహబంధం ఉందని, కొంక్యాన కుటుంబం నిర్విరామ సామాజిక సేవలు కొనసాగిస్తూ నగర ప్రజలకు చేరువయ్యారని గుర్తు చేసి, జెసిఐ సభ్యులకు అభినందనలు తెలిపారు. అలాగే వారం రోజులపాటు జరిగే కార్యక్రమ వివరాలను అధ్యక్షులు కూన.అనిల్ కుమార్, బెందాళం వరలక్ష్మిలు వివరించి, ప్రాజెక్ట్ చైర్మన్ బొడిగె.మధు, తమ్మినేని ఉషారాణిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో భాగంగా జెసిఐ గ్రీన్సిటీ, జెసిఐ శ్రీకాకుళం మెయిన్ కుటుంబసభ్యులంతా, స్థానిక శాంతా అనురాగ నిలయంలో పిల్లలకు, వృద్దులకు, అనాధులకు పళ్ళు, ఫలహారాలను ముఖ్య అతిధిచే అందించారు. అనంతరం జెసి సభ్యులను ముఖ్య అతిది కొంక్యాన.వేణుగోపాల్, జెసిఐ అధ్యక్షులు కూన అనిల్ కుమార్, బెందాళం వరలక్ష్మిలు చేతులమీదుగా బహుమతిని అందించి, దుస్సాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెసి మెంటర్ నటుకుల.మోహన్, జెసి ఉమా మహేశ్వర రావు, జెసి దూసి సంతోష్, జెసి ఆర్.శ్రీనివాస రావు, జెసి ఉర్లం.శివతేజ, , జెసి సాయి కృష్ణ, జెసి జాడ సాయి, జెసి గణపతి, జెసి కె.ఉష రాణి, డా.బడాన.దేవభూషణం, ప్రముఖులు మండవల్లి రవి, జెసి సాయిబాబా, పొడుగు చరణ్ ఇతర జెసి సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి పురస్కార గ్రహీతకు సన్మానం

విశాలాంధ్ర - పలాస : భిలాయ్ ఛత్తీస్‌గఢ్‌లో విద్యారంగంలో ఆదర్శ ఉపాధ్యాయురాలిగా, సమాజానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టిన ఉపాధ్యా యురాలు కోడ శారదాదేవి రాష్ట్రపతి పురస్కారం అందుకొని భిలాయ్‌కు సోమవారం చేరుకున్నారు. ఈ సందర్భంగా పవర్ హౌస్ చౌక్ వద్ద ఆమెకు ఆంధ్రా స్వాభిమాన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించి ఆమె ఉజ్వల భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కర్రి ఉమా శంకర్‌రావు మాట్లాడుతూ శారదా దేవి నిరంతరం కష్టపడి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును తీర్చి దిద్దేందుకు నిరంతరం కృషి చేశారన్నారు. దీని కారణంగా ఆమె భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మమ్ చేతులు మీదుగా గౌరవ పురస్కారాన్ని అందుకొని మన సమాజం గర్వించదగ్గ చరిత్ర సృష్టిం చిందన్నారు. సొసైటీ అధినేత కర్రి ఉమాశంకర్ రావు, మైలపల్లి ఈశ్వరరావు, మూగి వెంకటరావు, కర్రి ప్రసాద్‌రావు, పిట్ట దుర్యోధనరావు, పప్పు యరన్న, అంబటి జగన్నాథరావు, వాసుపల్లి వైకుంఠరావు, దాసరి శంకర్ రావు, ఎన్.భాస్కర్ రావు, డి.చిన్నారావు, వద్దీ అప్పారావు, మద్దు జోగారావు, కర్రి కృష్ణమూర్తి, జైపాల్‌మూర్తి, మద్దు ఆదినారాయణ, రమేష్ భగత్, దాసరి శ్రీనివాస్, విశ్వనాథ్, కర్రి నోకరాజు, కె.రాజులు శారదకు శుభాకాంక్షలు తెలిపారు.

కుందువానిపేట గ్రామస్థులకు అండగా లైన్స్ క్లబ్ సెంట్రల్

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : కుందువానిపేట గ్రామస్థులకు అండగా లైన్స్ క్లబ్ సెంట్రల్ శ్రీకాకుళం అండగా ఉంటుందని, బాధితులకు మా సహాయ సహకారాలు అందిస్తామని లైన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షులు లైన్. డా.బొడ్డేపల్లి సురేష్ సోమవారం తెలిపారు. వరదల బీభత్సములో భాగంగా శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, గౌండు.శంకర్ సూచనలమేరకు శ్రీకాకుళం జిల్లా, కుందువానిపేట గ్రామాన్ని, వాళ్ళు పడుతున్న కష్టాలను పరిశీలించి, వరద బాధితులకు చిరుసాయాన్ని అందించామని, ఇందులో భాగంగా పాలు, పళ్లు, బిస్కెట్స్, వాటర్ బాటిల్స్ అందించామని తెలిపారు. అలాగే గ్రామస్థులకు కాకుండా, శ్రీకాకుళం జిల్లా పరిధిలో వరద బాధితులకు అవసరమైన వైద్య పరీక్షలను లైన్స్ వైద్య బృందం, సెక్రటరీ లైన్. డా. పైడి సింధూర, ఇతర వైద్య బృందంతో నిర్వహించి, ఉచిత మందులను కూడా అందించటానికి సిద్ధం చేశామన్నారు. అనంతరం మెంటర్ నటుకుల.మోహన్, జోన్ చైర్మన్ పొన్నాడ.రవి, డిసి బడాన.దేవభూషణం పరిసర గ్రామస్థులకు, వరద బాధితులకు పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సెంట్రల్ సభ్యులు టెక్కం.రాంగోపాల్, గుత్తు .చిన్నా రావు, ఉర్లం.శివతేజ, పొడుగు.చరణ్, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు

విశాలాంధ్ర - టెక్కలి : మండలంలో చాకిపల్లి గ్రామంలో సోమవారం కె కోత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారిని ఎం.శైలజ, ఎంపీడీవో సిహెచ్ లక్ష్మీ బాయి వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు కారణంగా సీజనల్ వ్యాధులు పెరిగే అవకాశం ఉందని, దానిని గమనించి ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనం తరం, గ్రామంలో త్రాగునీరు, పారిశుద్ధ్యం, క్లోరినేషన్ వంటి అంశాలను గురించి గ్రామస్తులకు వివరించారు. కీళ్లనొప్పులు, జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి కావాల్సిన మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కె కొత్తూరు పిహెచ్సి వైద్య అధికారిణిలు డాక్టర్ గాయత్రి, డాక్టర్ ఇంద్రజ, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, అంగన్వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిత్య నారాయణ సేవకు రూ.10,000 అందజేత

విశాలాంధ్ర - టెక్కలి : స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో గల నిత్య నారాయణ సేవకు సోమవారం పేడాడ కోదండరావు శ్రీనివాసులమ్మ దంపతులు తల్లి దండ్రులు జ్ఞాపకార్థం రూ. 10 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వారికి వారి కుటుంబ సభ్యులకు భగవాన్ బాబా వారు దివ్య అనుగ్రహ ఆశీస్సులు కలగాలని అన్నపూర్ణమ్మ కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక జోనల్ ఇంచార్జ్ చంటి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ వంతెన పనులు పూర్తయ్యేది ఎన్నడు...?

పలాస నియోజకవర్గ ప్రజల ఆశలు ఫలించేనా..!

విశాలాంధ్ర-పలాస: పలాస ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణం పనులు కూటమి ప్రభుత్వములోనైనా పూర్తవుతుందా..? అని పలాస నియోజకవర్గం ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. వైసీపీ పాలన ఐదేళ్ల కాలంలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఫ్లై ఓవర్ వంతెన పూర్తి చేసేందుకు కృషి చేసిన సగం నిర్మాణం నుండి ఆగిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో శంకుస్థాపన చేసిన ఫ్లై ఓవర్ వంతెన పనులు నత్త నడకగా సాగుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో, వైసీపీ ప్రభుత్వంలో కూడా పూర్తి కాలేదు. తిరిగి కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ఈ ప్రభుత్వంలోనైనా ఆగిన పనులకు మోక్షం కలుగుతుందో లేదోనని మీమాంసలో ప్రజలు ఉన్నారు. నిత్యం రద్దీగా ఉండే పలాస, బెండిగేటు వద్ద గేట్లు పడడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా అప్పటి టెక్కలి ఎమ్మెల్యే, దివంగత నేత హనుమంతు అప్పయ్యదొర 2006లో రెండు రైల్వే గేట్లు వద్ద ఫ్లై ఓవర్ వంతెనల నిర్మా ణానికి అంకురార్పణ చేశారు. వాటి నిర్మాణానికి 28 రూ.కోట్ల నిధులు మంజూరు చేయాలని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి కోరారు. మంజూరైన నిధులతో పలాస, బెండిగేటు ఎల్సీ గేట్లపై వంతెన నిర్మాణం పనులకు 2009లో శంకుస్థాపన చేశారు. పలాస ఫ్లై ఓవర్ పనులతో పాటు వజ్రపుకొత్తూరు మండలం బెండి గేటుఫ్లై ఓవర్ వంతెన పనులు ఒకేసారి ప్రారంభమ య్యాయి. బెండిగేటు ఫ్లై ఓవర్ వంతెన పనులు పూర్తై వాహన రాకపోకలు జరుగుతున్నాయి. కాని పలాస రైల్వే ఓవర్ వంతెన పనులు నత్తనడకగా సాగు తుండటంతో వాహనాల రాకపోకలకు తలనొప్పిగా మారింది. వంతెన పనులు ప్రారంభించి ఏళ్ళు గడుస్తున్నా పూర్తి కాకుండా నిలిచి పోయాయి. వంతెన నిర్మాణానికి రైల్వే శాఖ నుండి రూ.8.50 కోట్లు, రహదారి భవ నాల శాఖ నుండి రూ.19.50 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో రైల్వే ట్రాక్పై 76 మీటర్లు పొడవున వంతెన పనులు, చినబడాం వైపు 520 మీటర్లు, కాశీబుగ్గ వైపు 280 మీటర్లు అప్రోచ్ రహ దారి పనులు చేపట్టవలసి ఉంది. ఐవీఆర్ సీఎల్ నిర్మాణ సంస్థకు 2012 అక్టోబర్ లో టెండరు ఖరారు అయింది. రైల్వే శాఖ నుండి మంజూరైన రూ.8.50 కోట్లతో రైల్వే ట్రాకైక్ పై భాగంలో వంతెన పనులు పూర్తి చేసినప్పటికీ ఆర్అండ్ బి శాఖ పనులు సాంకేతిక లోపం, నిర్వాసితులకు పరిహారం అందించకపోవడంతో అర్థాంతరంగా నిలిచిపోయాయి. వాస్తవానికి 2014 నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ కాకపోవ డంతో ఏడాది గడువు పొడిగించాలని నిర్మాణ సంస్థ కోరడంతో 2017 మార్చి వరకు గడువు పొడిగించారు. గడువు పూర్తయినప్పటికీ పనులు పూర్తి కాలేదు. ఇప్పటి వరకు జరిగిన పనులు పరిశీలిస్తే ఇంకా ఎన్నేళ్లు అవుతుందో తెలియని పరిస్థితి. ఇందుకు ప్రధాన కారణం వంతెన నిర్మాణంలో ఇళ్ళు కోల్పోయిన నిర్వా సితులకు వైసిపి ప్రభుత్వం పాలనలో నష్ట పరిహారంతో పాటు సూది కొండ వద్ద ఇళ్ల స్థలాల పట్టాలు కూడా అందజేశారు. రైల్వే గేటు నుండి చినబాడాం వైపు 240 మీటర్లు పొడవుతో వంతెన పనులు 188 మీటర్లు పొడవుతో గోడ పనులు చేపట్టి వైసిపి పాలనలో మమ.. అనిపించారు. కాశీబుగ్గ వైపు 176 మీటర్లు పొడవుతో వంతెన పనులతో పాటు 88 మీటర్లు గోడ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇందుకు గాను 126 మంది తమ భవనాలు, ఇళ్ళు, దుకాణాలు కోల్పోయారు. రైల్వే వంతెన ఫ్లై ఓవర్ పనులు రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం హయాంలోనైనా ఈ ఐదేళ్లలో పనులు పూర్తి అవుతాయని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఆ దిశగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అడుగులు వేస్తారని ఆశిద్దాం.